క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచులు



పార్టీలో చేరిన నాయకులతో జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: రాయికల్ మండలం ఇటిక్యాల మాజీ సర్పంచ్ సామల్ల లావణ్య–వేణు, మైతాపూర్ మాజీ సర్పంచ్ ఎండీ.అజారొద్దీన్, భూపతిపూర్ మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్‌తో పాటు, నాయకులు మేడ శ్రీనివాస్, మల్లిపల్లి కాశీం, అనంతుల సుమన్, శనివారం నిజామాబాద్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి వారి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సహకార సంఘం బలోపేతానికి కృషి



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న బీసీ నాయకులు

మెట్‌పల్లి: సహకార సంఘం మరింత బలోపేతమయ్యేలా కృషి చేస్తానని చైర్మన్ కామిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన తిరుపతిరెడ్డి ని బీసీ సంక్షేమ సంఘం నాయకులు, పలువురు కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు నల్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి బొమ్మెల శంకర్‌తో పాటు మాచర్ల సదానందం, పోతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మే డే జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు

మెట్‌పల్లి: మే డే ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకుడు ఉస్మాన్ అన్నారు. మెట్‌పల్లిలో శనివారం మేడే వాల్ పోస్టర్, కరపత్రాలను మున్సిపల్ కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బీవోసీ రాంబాబు, కార్మికులు శ్రీకాంత్, లక్ష్మణ్, మహేశ్, రాజశేఖర్, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మగుడిలో విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

జగిత్యాలరూరల్(రాయికల్): రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్‌లో పోచమ్మతల్లి ఆలయంలో శనివారం పోచమ్మ పోతరాజు, బలిపీఠం, సారలమ్మ, నీరలమ్మ విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పురోహితులు చెరుకు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో వేములవాడ వేద పండితులు రాజేంద్రశర్మ పర్యవేక్షణలో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాలకుర్తి రవి, నాయకులు రాజన్న, మల్లయ్య, దీపక్‌రావు, గడ్డం రాజిరెడ్డి గ్రామస్తులు ప్రారంభించారు.

రెండిళ్లలో చోరీ

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో తాళం వేసిన ఇళ్లలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. భాగ్యనగర్‌కు చెందిన కోరుకంటి రవి ఈనెల 24న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆయన ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.11 వేల నగదును ఎత్తుకెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన వనపట్ల శేఖర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి వెళ్లగా, దొంగలు ఇంట్లో ఉన్న రూ.50వేల నగదు ఎత్తుకెళ్లారు. శనివారం పక్కింటి వారు సమాచారం అందించడంతో పట్టణ ఎస్సైలు నరేశ్, మన్మథరావు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డిగ్రీ చదువులకు మోక్షమెప్పుడో?

- కథలాపూర్‌లో ఏర్పాటు చేయని డిగ్రీ కళాశాల
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తప్పని తిప్పలు
- దూరభారంతో మధ్యలోనే మానేస్తున్న విద్యార్థినులు



కథలాపూర్‌లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు

కథలాపూర్: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఉన్నత విద్యకు విద్యార్థులు దూరమవుతున్నారు. నిత్యం కిలోమీటర్ల దూరం ఉన్న డిగ్రీ కళాశాలకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతూ ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. డిగ్రీ కళాశాల లేకపోవడంతో తల్లిదండ్రులు విద్యార్థినులను దూరం పంపలేక చదువును మధ్యలోనే మాన్పిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి కథలాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఏటా 600 మంది విద్యార్థులు ఇంటర్ పూర్తి

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌లో ఏటా 350 నుంచి 400 మంది విద్యార్థులు ఇంటర్ పూర్తి చేస్తున్నారు. మరికొంత మంది విద్యార్థులు కోరుట్ల ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో చేరుతున్నారు. సుమారు ప్రతీ ఏటా 500 నుంచి 600 విద్యార్థులు ఇంటర్ పూర్తి చేస్తున్నారు. కథలాపూర్‌లో డిగ్రీ కళాశాల లేకపోవడంతో దూరంగా ఉన్న కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని, వాహనాలపై ఆధారపడి రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉంటుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మండలకేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే కథలాపూర్, బీమారం, రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలాల విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని, కళాశాల ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల విద్యార్థులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



ఇంటర్ కోర్సులు పూర్తిచేసే విద్యార్థుల సంఖ్య గత 10 ఏళ్లుగా పెరిగింది. పట్టణ ప్రాంత విద్యార్థులే కాదు.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఆసక్తి పెంచుకుంటున్నారు. ప్రతీ మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి. విద్యార్థుల అభిరుచికి తగ్గట్టుగా ఉండే డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలి. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి.

– కొండ్లెపు సాయిరాం, ఏబీవీపీ మండల కన్వీనర్

విద్యార్థినులు అవస్థలు



పదోతరగతి, ఇంటర్ వరకు చదువుకునే విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. డిగ్రీ కళాశాలలు దూరంగా ఉండటంతో డిగ్రీలో చేరే విద్యార్థినుల సంఖ్య తగ్గిపోతుంది. మేం చదువుకున్న డిగ్రీ కళాశాలలో అప్పట్లో ఇదే పరిస్థితి. గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు బస్సుల సౌకర్యం లేకపోవడమే ప్రధాన సమస్య. కథలాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే ఉన్నత విద్య దగ్గరవుతుంది.

– గుగ్లోత్ రవినాయక్, కథలాపూర్

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



15 ఏళ్ల క్రితం కథలాపూర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఆ తర్వాత డిగ్రీ కళాశాల ఏర్పాటు గురించి ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోలేదు. ఉన్నత చదువులు అందుబాటులో లేక గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఇంటర్ వరకే పరిమితమవుతున్నారు. డిగ్రీ, పీజీ కోర్సులను అందుబాటులోకి తెస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది. పాలకులు విద్యాభివృద్ధిపై దృష్టి సారించాలి.

– గాంధారి శ్రీనివాస్, యువజన సంఘాల నేత, సిరికొండ

మిల్లర్ల అక్రమాలు అరికట్టేందుకు స్పెషల్ ఆఫీసర్



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొండగట్టు: వడ్ల కొనుగోలులో మిల్లర్ల అక్రమాలను అరికట్టేందుకు కొనుగోలు కేంద్రాల పరిశీలనకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం శనివారం తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శనివారం మండల కేంద్రంలోని పలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలు ఎమ్మెల్యేకు చెప్పుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫోన్ చేసి మిల్లర్ల అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న మిల్లులను బ్లాక్ లిస్టులో చేర్చి వారికి ధాన్యాన్ని కేటాయించకుండా చూడాలన్నారు. తాలు,తప్ప పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని సెంటర్ నిర్వాహకులకు సూచించారు.

నిందితులను అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న అంబేడ్కర్ సంఘ నాయకులు

జగిత్యాలరూరల్: కులం పేరుతో దూషించిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రాయికల్‌లో మాట్లాడారు. ఈనెల 24న రామాజీపేటలో రాత్రి రోడ్డుపై వెళ్తున్న ఉదయ్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ కులస్తుడు దాడి చేసి, కులంపేరుతో దూషించాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు కూడా నమోదైందన్నారు. తక్షణమే కులం పేరుతో దూషించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కారంగుల వసంత్‌రావు, మండల అధ్యక్షుడు రాజనాల మధు, బెక్కం వెంకటేశ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదల సంక్షేమం



ప్రచారం చేస్తున్న హరితరెడ్డి, చరిష్మారెడ్డి

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదల సంక్షేమం సాధ్యమవుతుందని మహిళా కాంగ్రెస్ నాయకురాలు తాటిపర్తి హరితరెడ్డి, చరిష్మారెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట, పొరండ్ల గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల వద్ద జీవన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పొగళ్ల సంధ్యారాణి ,బొడ్డు లక్ష్మణ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, కోటి, సతీశ్, రాజేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉపాధి కూలీ రూ.400 చేస్తాం

సారంగాపూర్: కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోకి అధికారంలోకి రాగానే ఉపాధి హామీ కూలీ రోజుకు రూ. 400, పనిచేసే పనిముట్లను అందిస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బీర్‌పూర్ మండలం రేకులపల్లిలో శనివారం కాంగ్రెస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను వివరిస్తూనే, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేపట్టే పనులను వివరించారు. ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేశ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ పొల్సాని నవీన్ రావు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొండ్ర మల్లారెడ్డికి నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు

సారంగాపూర్: ఉమ్మడి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కొండ్ర మల్లారెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శనివారం సారంగాపూర్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నాయకులు, గ్రామస్తులు నివాళి అర్పించారు. ఉమ్మడి సారంగాపూర్ మండలం ఏర్పాటుతో పాటు, మండలం అభివృద్ధికి ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ ఏలేటి నర్సింహారెడ్డి, మానాల లక్ష్మణ్, న్యారబోయిన గంగాధర్, తోడేటి శేఖర్‌గౌడ్, ఆకుల జమున, మాజీ వైస్ఎంపిపి కొండ్ర రాంచంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బోరుబావి ప్రారంభం

జగిత్యాలరూరల్: రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్‌లోని పోచమ్మతల్లి ఆలయంలో బల్సు దుబ్బారెడ్డి–కాశమ్మ దంపతులు నిర్మించిన బోరుబావిని శనివారం మాజీ సర్పంచ్ పాలకుర్తి రవి, అనుపురం రాజన్న ప్రారంభించారు. దాదాపు రూ.50 వేల విలువ గల బోరుబావిని భక్తుల నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేశారు.

తండ్రి గెలుపు కోసం తనయ ప్రచారం



చిల్వకోడూర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న నందిని

గొల్లపల్లి: బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఆయన కూతురు నందిని మండలంలోని చిల్వాకోడూర్‌లో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. మంత్రిగా ఈశ్వర్ చేపట్టిన అభివృద్ధి పనుల, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి తన తండ్రిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయ్యండి

పెగడపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా కొప్పుల ఈశ్వర్ పెగడపల్లిలో చేసిన అభివృద్ధి పనులను గుర్తించి పెద్దపల్లి ఎంపీగా కొప్పులకు మరోసారి అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ శ్రేణులు కోరారు. మండలంలో నందగిరి, రామభద్రునిపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈజీఎస్ కూలీలతో సమావేశమై కారు గుర్తుకు ఓటేసి ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు గంగాధర్, సురేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, నరేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



ఉపాధి పనుల వద్ద ప్రచారం చేస్తున్న మాధవి

మేడిపల్లి: బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ సతీమణి డాక్టర్ మాధవి అన్నారు. మండలంలోని పోరుమల్ల, బీమారం, కమ్మరిపేట గ్రామాల్లో శనివారం ఉపాధి హామీ కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదిగిరి రమ్య, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్, రక్షణ బీజేపీకే సాధ్యం



ఇంటింటా ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: దేశ భవిష్యత్తు, దేశ రక్షణ బీజేపీకే సాధ్యమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని బతికపల్లిలో శనవారం పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొమురెల్లి, బీజేవైఎం మండల అధ్యక్షుడు కిశోర్, నాయకులు రమేశ్, లక్ష్మీరాజం, శేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచార రథాలు ప్రారంభం



ప్రచార రథాలు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

కోరుట్ల రూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కోరుట్ల నియోజకవర్గంలో సీఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత చెన్నమనేని శ్రీనివాస రావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రచార రథాలను డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ కాంగెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు,సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, కొంతం రాజం, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ విప్ పరామర్శ

గొల్లపల్లి: మండలంలోని ఇస్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన సంకటి చంద్రశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని శనివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

శివపార్వతుల కల్యాణానికి ఆహ్వానం

ధర్మపురి: మండలంలోని జైనా శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుంట సుధాకర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు రెండో పీఆర్సీ వర్తింపజేయాలి



హెచ్‌ఎంను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

మల్యాల: పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండో పీఆర్సీ ప్రయోజనాలను వర్తింపజేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లి గెజిటెడ్ హెచ్‌ఎం జాలి మహేందర్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రెండో పీఆర్సీని అమలు చేయాలని, పీఆర్సీ ద్వారా వచ్చే గ్రాటివిటీ పెంపు కమిటేషన్ మార్చి నుంచి పదవీవిరమణ పొందుతున్న ఉద్యోగ,ఉపాధ్యాయులకు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యాల్ల అమర్‌నాథ్‌రెడ్డి, కార్యదర్శి బోయినపల్లి ఆనంద్‌రావు, సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మపురి: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్, మండల, పట్టణశాఖ అధ్యక్షులు మొగిలి శేఖర్, ఆకుల రాజేష్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యయత్నం

బుగ్గారం: పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని మనస్థాపంతో సమీర్ అనే యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన బుగ్గారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపులాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతి రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన ఎండీ సమీర్ అనే యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని బుగ్గారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సదరు యువకుడిని విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం స్టేషన్ నుంచి తిరిగి వెళ్లిన కొద్ది సేపటికే సమీర్ పురుగుల మందు తాగాడు. వెంటనే పోలీసులు వెంటనే సదరు యువకుడిని జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రాణాపాయం ఏమి లేదని ఆస్పత్రి వైద్యులు తెలిపినట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ‘జువ్వాడి’ పరామర్శ

మల్లాపూర్: మండలంలోని రాఘవపేట, ఒబులాపూర్ తండా గ్రామాల్లో శనివారం బాధిత కుటుంబాలను పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. రాఘవపేట గ్రామానికి చెందిన దుంపేట సంజీవ్, ఒబులాపూర్ తండాలో భూక్య సునీత పాముకాటుతో మృతి చెందగా, బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముద్దం రాజేందర్‌రెడ్డి, విజయ్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్కూల్ డే వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కథలాపూర్: మండలకేంద్రంలోని మాస్టో హైస్కూల్‌లో శనివారం స్కూల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీపీ జవ్వాజి రేవతి, కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, హెచ్ఎం రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి



బహ్రెయిన్‌లో సమావేశమైన ఎన్ఆర్ఐలు

జగిత్యాలరూరల్: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ నాయకులు కోరారు. ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు రాదారపు సతీశ్‌కుమార్ అధ్యక్షతన బహ్రెయిన్‌లోని అండాలస్ గార్డెన్‌లో కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమ పార్టీని గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు పుప్పాల భద్రి, సుమన్, రాజేందర్, ప్రమోద్, రాజలింగం, దేవయ్య, శ్రీనివాస్, రాజేందర్, శ్రీకాంత్, స్వామి పాల్గొన్నారు.

వేంపల్లిలో బెల్ట్‌షాప్ నిర్వహణకు వేలం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బెల్ట్‌షాప్ నిర్వహణకు, మద్యం అమ్మకాలకు వేలం పాట నిర్వహించినట్లు తెలిసింది. కాగా ఈ వేలం పాటలో పాల్గొన్న వారిలో గ్రామానికి చెందిన ఒకరు రూ.5.08 లక్షలకు బెల్ట్‌షాప్‌ను దక్కించుకున్నట్లు సమాచారం. మండలంలోని పలుగ్రామాల్లో వీడీసీల పేరుతో యథేచ్ఛగా వేలంపాటను నిర్వహిస్తున్నా.. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో వీడీసీల ఆగడాలు శృతి మించుతున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్ట్ షాప్ వేలంపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, బాధితులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటకు చెందిన గడ్డం శ్రీనివాస్(42) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి బీజేపీ నాయకులు శనివారం రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.